క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

కాకినాడ సిటీ: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కాకినాడలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో పలు మండలాల్లో ఇప్పటికే పంట కోసి, ధాన్యం రాశులు పోసి ఉన్నాయన్నారు. అవి తడిసిపోయి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఆర్బీకే సిబ్బంది రైతులకు సహకరించాలని రాజశేఖర్ వివరించారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కాకినాడ: స్థానిక సాంబమూర్తి నగర్, రెవెన్యూ కాలనీ ప్రాంతాల్లో సాగుతున్న పారిశుధ్య పనులను నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు మంగళవారం తనిఖీ చేశారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, చెత్త విభజన, తరలింపును పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుడుపూడి సత్యానారాయణ, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

ఏపీఎస్పీలో వేసవి శిక్షణ ప్రారంభం



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్ సీహెచ్ విజయరావు దంపతులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట మూడో ఏపీఎస్పీ బెటాలియన్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని కమాండెంట్ సీహెచ్ విజయరావు దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శిబిరంలో ఏర్పాటు చేసిన కార్యకలాపాలన్నీ ఉత్సాహంగా నేర్చుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, బెటాలియన్ అడిషనల్ ఎస్పీ ఎల్. అర్జున్, అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ఇతర అధికారులు, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల అందజేత

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ప్రశాంతి ఆధ్వర్యంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు రిలయన్స్ ఆర్థిక సాయంతో పోషకాహార కిట్లను అందించారు. తాళ్లరేవు, తూరంగి, కరప ప్రాంతాలకు చెందిన 24 మందికి ఒక్కొక్కరికి రూ.700 విలువైన కిట్లను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ జిల్లా కోఆర్డినేటర్ టి వెంకటేష్, ఎంపీహెచ్‌ఈవో పీవీ ప్రసాదరావు, ఎంపీహెచ్‌ఎస్ రాజశేఖర్, సామ్రాజ్యం, విజయకుమారి, గోవిందరావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ల రద్దుపై నిరసన



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు

బాలాజీచెరువు: ట్రేడ్ యూనియన్ల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నిరసన తెలియజేసింది. కాకినాడ హెడ్ పోస్టాఫీసు వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ట్రేడ్ యూనియన్ ఎన్ఎఫ్‌పీఈ గ్రూప్–సీ యూనియన్‌ను రద్దు చేయడంపై నిరసన తెలుపుతూ వెంటనే దాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ గ్రూప్–సి కార్యదర్శి పి.సాగర్, వైస్ ప్రెసిడెంట్ మూర్తి, శ్రీనివాసరావు, పెన్షనర్ల కార్యదర్శి తురగా సూర్యారావు, సీహెచ్ రామారావు పాల్గొన్నారు.

బోదతో అప్రమత్తం



అరట్లకట్ట సబ్‌సెంటర్‌లో బోద వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

కరప: బోద వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉంటూ, వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అరట్లకట్ట, గొడ్డటిపాలెం సర్పంచ్‌లు గోపి సత్యవేణి, వాసంశెట్టి శ్రీనుబాబు పేర్కొన్నారు. అరట్లకట్ట సబ్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బోదవ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యసిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల బోద వ్యాధిగ్రస్తులకు టబ్‌లు, సబ్బులతో కూడిన కిట్లను సర్పంచ్‌లు పంపిణీచేశారు. సీహెచ్‌ఓ వై.రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈఓ గంగాధర్, ఎస్‌యూఓ డానియల్, పీహెచ్‌ఎన్ టీబీటీ సుందరి, ఎంపీహెచ్‌ఎస్ సత్యనారాయణమ్మ, రాధాకృష్ణ, ఏఎన్ఎం సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారవేంద్రాలు



ఐటీఐ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న చలివేంద్రం

- ఆరంభ శూరత్వంగా ఏర్పాటు
- ముణ్ణాళ్ల ముచ్చటగా ఖాళీగా కేంద్రం
- ఫొటోలకే పరిమితమవుతున్న సేవ

బాలాజీచెరువు: వేసవి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తాగాలని వైద్యులు సూచించడం, దానికి తోడు ఉష్ణోగ్రత అధికంగా ఉండటంతో దాహం విపరీతంగా వస్తుంది. ఇటువంటి నేపథ్యంలో వేసవి వచ్చిందంటే చాలా స్వచ్ఛంద సంస్థలతో పాటు పలువురు ప్రముఖులు ఆరంభ శూరత్వంగా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిర్వాహకుల వైఫల్యమో, కేవలం ప్రచార ఆర్భాటమో తెలీదు కానీ మూన్నాళ్లకే ఆ వేంద్రంలో కేవలం ఖాళీ డబ్బాలు దర్శనమిస్తున్నాయి. దాహార్తితో ఆ కేంద్రానికి వెళ్లేవాళ్లని ఖాళీ దిమ్మలు, గట్లు వెక్కిరిస్తున్నాయి. నగరంలో వేసవిని దృష్టిలో పెట్టుకుని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లతో పాటు మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ శాఖలు కలిసి జగన్నాథపురం, దేవాలయం వీధి, సినిమా రోడ్డు, భానుగుడి, రామారావు పేట, టూటౌన్, గాంధీనగర్ పార్కు, జన్మభూమి పార్కు వంటి ప్రాంతాల్లో చలివేంద్రాలు చాలా వరకు ఏర్పాటు చేశాయి. అయితే ఇవి ప్రారంభించి పది రోజులు పూర్తికాకుండానే మూసేసారు. రోజురోజుకు పెరుగుతున్న భూతాపానికి వాహనచోదకులు, పాదచారులు ఈ చలివేంద్రాలు ద్వారా గొంతు తడుపుకొనేవారు. అయితే ఇవి కొన్నిచోట్ల బోర్డులకే పరిమితమై నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు చేసేదిలేక దాహార్తితో ముందుకు సాగిపోతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఐటీఐలో వాహనాల రిజిస్ట్రేషన్, లైసెన్స్‌ల కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రతి రోజూ 200 మంది వస్తుంటారు. వీరితో పాటు ఇదే ప్రాంగణంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఉండటంతో వివిధ పనుల నిమిత్తం వందలాది మంది వస్తుంటారు. ఈ ప్రాంగణంలో రవాణాశాఖ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రం ముణ్ణాళ్ల ముచ్చటగా మారి కేవలం ఫ్లెక్సీ తప్ప మరేమీ కనింపించడం లేదు. నగరంలో ఇలా మరెన్నో ఉన్నాయి. వేసవి ముగిసే వరకైనా వీటిని కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.



దేవాలయం వీధిలో మూతపడి ఉన్న చలివేంద్రం

వేసవి అంతా కొనసాగించాలి



ముఖ్యంగా మే నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నెలంతా నిర్వహించాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌ల వంటివి ప్రారంభ సమయంలో చేసే హడావుడి తప్ప మిగతా సమయంలో అంతగా దృష్టి పెట్టడం లేదు.
– డి.డేవిడ్ ఏలిజియర్, ఐటీఐ అధ్యాపకులు

ముంపు నివారణకు కార్యాచరణ



వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల

- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల
- కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశం

కాకినాడ: వర్షాల వల్ల ఎదురయ్యే ముంపు సమస్య పరిష్కారానికి పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల పేర్కొన్నారు. ఇందుకోసం నగరపాలక సంస్థ యంత్రాంగం, కార్పొరేట్ సంస్థల మధ్య సమన్వయం అవసరమన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కేఎస్‌పీఎల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ వంటి సంస్థల ప్రతినిధులతో ముంపు సమస్య ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, నగరపాలక సంస్థ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కార్పొరేషన్ ఎస్ఈ సత్యకుమారి నగరంలోని డ్రైనేజీ వ్యవస్థ, ముంపు సమస్యకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత డ్రైనేజీ వ్యవస్థలోని లోపాలు, మేజర్ డ్రైన్ అవుట్‌లెట్‌ల వద్ద నెలకొన్న సమస్యల వల్ల తరచూ అనేక ప్రాంతాలు తీవ్రమైన ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. మరో నెల రోజుల్లో ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని, దీనిని అధిగమించేందుకు సత్వరమే ముందస్తు కార్యాచరణకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా కేఎస్‌పీఎల్, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమండల్ సంస్థలకు చెందిన ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు బృందంగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు సమస్యకు కారణాలు, పరిష్కార మార్గాలపై నాలుగు రోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణపై మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుందామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోర్ట్ ఎస్ఈ జీవీ రాఘవరావు, ఈఈ ఎంబీ పద్మశ్రేణి ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీఈలు మాధవి, సుబ్బారావు, కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, ఎన్ఎఫ్‌సీఎల్ సీనియర్ మేనేజర్ (సివిల్) ఆర్.నవీన్ చంద్ర కోరమండల్ జీఎం పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల ఐక్యతకు కృషి చేయాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న శెట్టిబలిజ జనజాగృతి సభ్యులు

కాకినాడ సిటీ: శెట్టిబలిజల ఐక్యతకు, పటిష్టతకు కృషి చేయాలని తెలుగు జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం సాయంత్రం రామారావుపేటలోని దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజ వసతి గృహంలో శెట్టిబలిజ జనజాగృతి సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన సంఘం పెద్దలు డాక్టర్ పితాని అన్నవరం, నురుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి ఈశ్వరిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. శెట్టిబలిజలు సంఘంలోని ఉన్న చిన్నచిన్న లోపాలను సరిదిద్ది, జిల్లా వ్యాప్తంగా ఉన్న కులస్తులంతా ఒకే తాటిపైకి వచ్చి మిగిలిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలను కలుపుకుంటూ రాజకీయంగా బలోపేతం కావల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. గతంలో సేవా సంఘానికి రూ.10 లక్షలు అందజేసిన గుబ్బల తులసీకుమార్ తాను ఇచ్చిన రూ.10 లక్షలు తిరిగి తీసుకున్నారని సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రకటించారు. ఇప్పుడు జనజాగృతి సేవా సంఘానికి గుబ్బల తులసీ కుమార్ అనే వ్యక్తికి ఎటువంటి సంబంధం లేదన్నారు. శెట్టిబలిజ జనజాగృతి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా రాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా అనుసూరి చినబాబు, ప్రధాన కార్యదర్శిగా కర్రి గోపాలకృష్ణ, కార్యదర్శిగా కాలా సత్తిబాబు, కోశాధికారిగా రాయుడు సుధాకర్‌లతో పాటు మరో ఏడుగురు కార్యనిర్వాహక సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. సంఘ పెద్దలు పెంకే శ్రీనివాసబాబా, కండిపల్లి వెంకటరమణ, గెద్దాడ వెంకటేశ్వరరావు, రాయుడు దుర్గ, గుత్తుల వీరబ్రహ్మం, చింతపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనజాగృతి సేవా సంఘం లోగోను ఆవిష్కరించారు.

జీజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



అమ్మాణికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవీణ్

కరప: కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి మంగళవారం గ్రామ వలంటీర్ పింఛన్ అందజేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. మండలం జి.భావారం గ్రామానికి చెందిన ఆకుల అమ్మాణి కాకినాడ జీజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకుని, చికిత్స పొందుతోంది. సర్పంచ్ రొక్కాల గణేష్ స్పందించి ఈవిషయాన్ని వలంటీర్ సుందరపల్లి ప్రవీణ్‌కు చెప్పగా ఆయన జీజీహెచ్ పింఛన్ అందజేశారు. దీంతో లబ్ధిదారు ఆనందం వ్యక్తం చేస్తూ వలంటీర్‌ను, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అభినందించింది.

డిప్లమో ఇన్ లాంగ్వేజ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ 10 నెలల డిప్లమో ఇన్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ మంగళవారం తెలిపారు. తరగతులు జూలై ఐదో తేదీ నుంచి ప్రారంభమవుతాయనని, ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యానిమేటర్ ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో యానిమేటర్‌గా పని చేస్తున్న కొచ్చర్లపాటి గాయత్రి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లికి చెందిన గాయత్రి కొంత కాలంగా యనిమేటరుగా పనిచేస్తోంది. తనతో పాటు పనిచేస్తున్న ఓ సీనియర్ యానిమేటర్ తనపై ఒత్తిడి చేయడమే కాకుండా తన గురించి అందిరికీ తప్పుగా ప్రచారం చేయడంతో మనస్తానం చెంది యూరియ తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం మెరుగుపడంతో వైద్యులు ఇంటికి పంపించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

జాతి ప్రయోజనం కోసమే ఉద్యమించాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏసుదాసు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జాతి ప్రయోజనం కోసం ఉద్యమం చేశాం తప్ప వ్యక్తిగత ప్రయోజం కోసం కాదని ఆంధ్ర రాష్ట్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాపు ఏజేసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. తుని రైలు దహనం కేసు కొట్టివేయడంపై కాపు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కాకినాడ కాపు కల్యాణమండపంలో మంగళవారం సంబరాలు చేసుకున్నారు. తుని రైలు దగ్ధం కేసులో అమాయకులు ఏడేళ్లుగా మనోవేదన అనుభవించారన్నారు. రానున్న కాలంలోను కాపులంతా కలిసి పనిచేస్తామన్నారు. కాపులపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు కేసులు ఉన్నాయని వాటిని కూడా ఎత్తివేయాలన్నారు. అనంతరం సంఘం అధ్యక్షులు వీవై దాసును కాపు నాయకులు సత్కరించారు. సంఘ నాయకులు చిట్నీడి శ్రీనివాస్, బసవా ప్రభాకరరావు, సలాది మూర్తి, పి.సేతు మాధవరావు, శిద్ధ నూకరాజు, పెద్దిరెడ్డి రామలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ
- మండల స్థాయి అధికారులతో సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా 2023–24 సంవత్సరానికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ మండల పరిపాలన, విస్తరణాధికారులను అదేశించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులు, విస్తరణాధికారులతో పంచాయతీరాజ్ చట్టం–1994ను అనుసరించి అభివృద్ధి ప్రణాళికల తయారీ, 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణ తదితర అంశాలపై నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023–24, 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణ, స్పందనకు వచ్చిన అర్జీలు పరిష్కారం, ఈ–ఆఫీసు, గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ ఆస్తుల నిర్వహణ, లోకల్ బాడీ ఆడిట్ చట్టాన్ని అనుసరించి ఆడిట్ అభ్యంతరాలు, తదితర అంశాలపై వర్క్‌షాపులో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు పి.నారాయణమూర్తి, ప్రసాద్, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

అ'విశ్రాంత' సేవలు అభినందనీయం



వేసవి వినోద-విజ్ఞాన కార్యక్రమంలో మాట్లాడుతున్న సోమన్నచౌదరి

సామర్లకోట: విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణశ్రీ సేవలు అభినందనీయమని జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. మంగళవారం సాయంత్రం మాధవపట్నం శివారు జమునానగర్‌లో జరిగిన వేసవి వినోద–విజ్ఞాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా ఎన్నో కార్యక్రమాలు చేసిన కృష్ణశ్రీ పదవీ విరమణ తరువాత కూడా రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కృష్ణశ్రీ మాట్లాడుతూ పిల్లల కోసం పని చేయడంలో అలసట ఉండదని, కాకినాడ జన విజ్ఞాన వేదిక, స్థానిక బాల మందిరం సంస్థల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయిని పి.సత్యవేణి బాలబాలికలకు కాగితాలతో వివిధ రకాల బొమ్మలు చేయడంలో శిక్షణ ఇచ్చారు. స్థానిక తోలు బొమ్మలాట కళాకారుడు గణపతిరావు పద్య పఠనం ద్వారా పిల్లలను అలరించారు. ఈనెల 8వ తేదీ వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందని కృష్ణశ్రీ తెలిపారు.

9 నుంచి న్యాక్ బృందం పర్యటన



సమీక్షలో పాల్గొన్న వర్సిటీ డైరెక్టర్లు, సిబ్బంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ నెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు న్యాక్ బృందం జేఎన్‌టీయూకేను పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం బోధన, బోధనేతర సిబ్బందితో వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు సమీక్షించారు. వర్సిటీకి మొదటిసారిగా 2017–22 వరకూ న్యాక్ గుర్తింపు వచ్చిందని, రెండోసారి ఆ బృందం వస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. వారి గుర్తింపు ద్వారా అధిక మొత్తంలో నిధులు మంజూరవుతాయన్నారు. అధ్యాపకులు పాఠ్యాంశాలు, ల్యాబ్‌లు తదితర వివరాలతో అన్నింటితో సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే ఈ నెల 31న నిర్వహించే స్నాతకోత్సవానికి సంబంధించి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరౌతున్నారని, ఆ కార్యక్రమం విజయవంతం అయ్యేలా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సమీక్షలో రిజిస్ట్రార్ సుమలత, డీఈ బాలకృష్ణ, డీఏఏ మురళీకృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆకతాయిల చిల్లరపని



నీటి సరఫరా కోసం రోగుల బంధువుల పడిగాపులు

- ఇనుప కాయిన్‌తో నీరు తీసుకునేందుకు యత్నం
- జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన యంత్రానికి మరమ్మతులు
- ఇబ్బంది పడిన రోగులు, వారి బంధువులు



మల్టీకాయిన్ మానిటర్‌లో ఇరుక్కున్న ఇనుప నాణాలివే...

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో 'చిల్లర'గాళ్ల నిర్వాకం రోగులను ఇబ్బందుల పాలుచేసింది. మాతాశిశు విభాగం ఆవరణలో కొనసాగుతున్న ఎన్ఎఫ్‌సీఎల్ మంచి నీటి ఆర్‌ఓ ప్లాంటు కేవలం రూ.1 నామ మాత్రపు రుసుముతో లీటర్ పరిశుభ్రమైన నీటిని అందిస్తూ ఎందరో రోగుల దాహార్తిని తీరుస్తోంది. మంగళవారం ఆ రూపాయి కూడా చెల్లించేందుకు మనసొప్పని ఆకతాయిలు ఇనుప నాణాలు వేసి నీళ్ల పట్టే ప్రయత్నం చేశారు. ఒక కాయిన్ వేస్తే ఫలితమేమీ లేకపోయేసరికి మరో కాయిన్ వేసి మరీ ఆ యంత్రాన్ని చెడగొట్టారు. దీంతో రోగులు, వారి బంధువులు ప్రత్యామ్నాయాల వెంట పడాల్సి వచ్చింది. నిర్వాహకులు ఎందుకు నీటి సరఫరా ఆగిందో తెలియక గందరగోళానికి గురై కాయిన్ బాక్స్ తెరిస్తే రూపాయి నాణాలను పోలి ఉన్న రెండు ఇనుప నాణాలు మానిటర్‌లో ఇరుక్కుపోయి ఉండడాన్ని గమనించారు. ఆకతాయిల పనికి అసహనం వ్యక్తం చేసి మరమ్మతులకు పరుగులెట్టారు.

కొనసాగుతున్న ఎంపీడీఓల శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నూతన ఎంపీడీఓల శిక్షణ కొనసాగుతోంది. ఈనెల 31 వరకు వారు శిక్షణ పొందనున్నారు. ఫ్యాకల్టీ టి.మల్లికార్జునరావు జిల్లా అధికారులతో అనుసంధానం, ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయంలో నిర్వహించాల్సిన విధులు, ఫైల్స్ నిర్వాహణ, ఆడిట్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపల్ ఇ.కృష్ణ మోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, జి.శ్రీదేవి, ఎంఎస్ఎన్ రెడ్డి, కేఎస్ఆర్ నిహారిక, బి.వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు శిక్షణలో పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే పథకాలు



పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా కాకినాడ అర్బన్ 2వ డివిజన్ సచివాలయం–2 పరిధిలో మంగళవారం సాయంత్రం ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాటి సూరిబాబు, ప్రకాష్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కురసాల సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ ఐ.శ్రీను, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.